సాక్షి
నిజామాబాద్
బుధవారం । 1 । జనవరి । 2025

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం బుధవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించింది. నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యానంద్



నిజామాబాద్ అర్బన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లావాసి సత్యానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, గంగాధర్ మంగళవారం తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తగ్గిన పసిడి ధరలు



నిజామాబాద్ రూరల్: బంగారం ధరలు మరోసారి కాస్త తగ్గాయి. నగరంలో మంగళవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.78,800, 22 క్యారెట్ల బంగారం రూ.72,705 పలుకుతోంది. కిలో వెండి ధర ప్రస్తుతం రూ.91 వేలకు తగ్గింది.

ఉద్యోగాల పేరిట ఫోన్లు చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: స్టాఫ్ నర్సు అభ్యర్థులకు ఉద్యోగాల పేరిట ఫోన్ చేసి డబ్బులు అడిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ హెచ్చరించారు. 'వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలంటూ ఫోన్లు' అనే శీర్షికన 'సాక్షి' పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. అభ్యర్థులు ఎవరికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా మెరిట్ ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అభ్యర్థులకు ఫోన్ చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సందేహాలుంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు నిజామాబాద్‌కు ఎస్సీ కమిషన్ రాక

కామారెడ్డి అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ గురువారం నిజామాబాద్ జిల్లాకు రానుంది. ఉదయం 11గంటలకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి సలహాలు, సూచనలు, వినతులు స్వీకరించనున్నట్లు కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన ఉద్యోగులు, సంఘాల నాయకులతో పాటు ఇతరులు వినతులు ఇవ్వవచ్చన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ఖలీల్‌వాడి: బహింగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులు జనవరి 1నుంచి 15 వరకు అమలులో ఉంటాయన్నారు. అలాగే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు డీజేలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని పేర్కొన్నారు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరి పాటించాలన్నారు. జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చేముందు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలను ఎవరైనా అతిక్రమించినచో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి..



నగరంలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు





నగరంలోని కాకతీయ కాలేజీలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్యాలతో హోరెత్తించారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కాకతీయ కాలేజీలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కాలగర్భంలో కలిసి పోయింది. గత సంవత్సరం మిగిల్చిన జ్ఞాపకాలను మదిలో దాచుకొని జిల్లావాసులు కోటి ఆశలతో 2025కు స్వాగతం పలికారు. నవ వసంతంలో అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ సంబురాలు చేసుకున్నారు. యువత మంగళవారం సాయంత్రం నుంచే న్యూ ఇయర్ వేడుకల్లో మునిగిపోయారు. నృత్యాలతో సందడి చేశారు. రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు.

– నిజామాబాద్ రూరల్

గేరు మారుస్తాం!


• కొత్త సంవత్సరంలో మరిన్ని ప్రణాళికలతో ముందుకు.. • ప్రజా సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు • 'సాక్షి'తో జిల్లా ప్రజాప్రతినిధులు

కొత్త సంవత్సరంలో పాలనలో గేరు మార్చి అభివృద్ధి పనులు చేపడుతామని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తెలిపారు. 2025లో ప్రజాసేవలు, అభివృద్ధి విషయంలో లక్ష్య సాధన కోసం మరిన్ని ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకెళతామని పేర్కొన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ ఏడాదిలో గేర్ మార్చి మరింత వేగంగా ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో అడుగులు వేయనున్నట్లు పేర్కొన్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

జిల్లా అభివృద్ధి కోసం ప్రణాళికలు

మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు



నా రాజకీయ జీవితంలో 2024 మరువలేనిది. ప్రతి ఒక్కరి ప్రోత్సాహంతో ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడినయ్యా. కార్యకర్తలందరి సహకారంతో ఇంత గొప్ప గౌరవం దక్కించుకున్నా. మరోసారి పార్టీ అధికారం సాధించే లక్ష్యంతో ఈ ఏడాది పార్టీని ముందుకు తీసుకెళ్తా. జిల్లా అభివృద్ధిలో ప్రణాళికలు తయారు చేస్తాం.

ఇందూరు కేంద్రంగా పసుపు బోర్డు

ధర్మపురి అర్వింద్, ఎంపీ



పసుపు రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డును సాధించే విషయంలో విజయవంతమయ్యాం. కేంద్రం నుంచి గెజిట్ కూడా వచ్చింది. ఈ బోర్డును ఇందూరు కేంద్రంగానే ఏర్పాటు చేసేందుకు ఢిల్లీలో గట్టి ప్రయత్నాలు చేస్తున్నా. ఈ ఏడాది బోర్డును ప్రారంభించేలా అడుగులు వేస్తాం. మరోవైపు నవోదయ పాఠశాల నిర్మాణం, ఆర్‌వోబీల నిర్మాణం పూర్తి చేయిస్తా. ఇప్పటికే బోధన్, నిజామాబాద్‌లో రెండు కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభించాం. ఇకపై మరింత స్పీడ్ పెంచుతా. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని జిల్లా అభివృద్ధి కోసం పక్కాగా ముందుకెళతా.

ఉపాధి కల్పించే లక్ష్యంతో..


పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే



జిల్లాలో వ్యవసాయ అధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు కృషి చేస్తున్నా. ఇప్పటికే నిజాం షుగర్స్ తిరిగి ప్రారంభించే లక్ష్యంతో అనేక అడుగులు వేశాం. ఈ ప్రక్రియ వేగంగా నడుస్తోంది. లక్కంపల్లి సెజ్‌లోనూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా.

లక్కంపల్లిలో పరిశ్రమలకు కృషి

• పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే



లక్కంపల్లి సెజ్‌లో వ్యవసాయ అధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా. ఆర్మూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంజినీరింగ్ కళాశాల, కొత్త మున్సిపల్ భవనం, మున్సిపాలిటీకి రూ.50 కోట్ల ప్రత్యేక నిధులు తెస్తా. కేంద్రం నుంచి ఇప్పటికే రూ.30 కోట్లు తెచ్చా. అమృత్ స్కీం ద్వారా రూ.43 కోట్లు, కేంద్రం నుంచి మరో రూ.22 కోట్లు, మాక్లూర్ నర్సింగ్ కాలేజీకి రూ.15 కోట్లు, నందిపేటలో 30 పడకల ఆస్పత్రి, ఆలూరు, డొంకేశ్వర్‌లలో జూనియర్ కళాశాలలు తీసుకొచ్చా.

పనుల మంజూరుకు చర్యలు

డాక్టర్ భూపతిరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే



నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులెత్తించే విషయంలో ప్రతిపాదిత పనుల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నా. రూ.250 కోట్లతో అన్ని లోలెవల్ వంతెనలను హైలెవల్ వంతెనలుగా, సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చేందుకు మంత్రి అంగీకరించారు. మరో రూ.70 కోట్లతో పీఆర్ రోడ్లకు, రూ.22 కోట్లతో రామడుగు కుడి, ఎడమ కాలువలకు గైడ్‌వాల్స్‌కు ప్రయత్నాలు చేస్తున్నా. ఇందల్వాయిలో ట్రామాకేర్, టీయూలో ఇంజినీరింగ్ కాలేజీ, జక్రాన్‌పల్లిలో నవోదయ, వ్యవసాయ కళాశాల, డ్రైపోర్టు ఏర్పాటు, గుండారం వద్ద ఐటీఐ, గుండారం, మల్కాపూర్ వద్ద అగ్రి సెజ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నా. మంచిప్ప ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తా. ఇప్పటికే రోడ్లకు రూ.53 కోట్లు, పాఠశాలలకు రూ.32 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలకు రూ.12 కోట్లు, విలీన గ్రామాలకు రూ.18 కోట్లు, సిరికొండలో ఐటీఐ, సుద్దులంలో సమీకృత పాఠశాల, డిచ్‌పల్లిలో డిగ్రీ కళాశాల సాధించా.

హామీల అమలుకు పోరు

వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే



ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా చేసేందుకు ప్రజల తరఫున పోరాటాలు చేస్తా. ఇందుకు సంబంధించి కార్యాచరణను సిద్ధం చేసుకున్నాం. ఇందిరమ్మ ఇళ్లు, తులం బంగారం, స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, పోడు భూములకు పట్టాలు, రేషన్ కార్డులు అర్హులందరికీ లభించేవరకు పోరాటం ఆపేది లేదు. ఇక శ్రీరాంసాగర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

స్మార్ట్ సిటీ కోసం

ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే



నగరాన్ని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడం కోసం కృషి చేస్తా. నగరంలో చారిత్రక కట్టడాల ప్రాధాన్యం దేశవ్యాప్తంగా తెలిసేలా చేస్తా. జీజీహెచ్‌కు కేంద్రం నుంచి నిధులు తెస్తా. గిరిరాజ్ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ కోసం కృషి చేస్తా. ఎల్లమ్మగుట్ట వంతెనను పూర్తి చేయిస్తా. ఇప్పటికే రూ.217 కోట్ల అమృత్ నిధులు, రూ.162.81 కోట్ల యూజీడీ నిధులు, బస్వా గార్డెన్ వద్ద రోడ్డు వెడల్పు పనులకు రూ.7.66 కోట్లు, డబుల్ ఇళ్ల మరమ్మతులకు రూ.1.25 కోట్ల నిధులు తీసుకొచ్చా.

ఆర్‌వోబీల పెండింగ్ బిల్లులు విడుదల

• ఎంపీ అర్వింద్ చొరవతో రూ.13.27 కోట్లు రిలీజ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు ఆర్‌వోబీ నిర్మాణ పనుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేక చొరవతో రూ.13.27 కోట్లు విడుదలయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ డిసెంబర్ 22న కలిసి నిధుల విడుదల విషయమై చర్చించారు. బీజేపీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరున్న ఎంపీ అర్వింద్, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి పలు అంశాలపై చర్చించిన విషయం తెలిసిందే. కాగా జిల్లాలోని అడవిమామిడిపల్లి, అర్సపల్లిలో నిర్మిస్తున్న ఆర్‌వోబీలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు కాగా, మాధవనగర్ ఆర్‌వోబీ మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం సగం నిధులతో నిర్మిస్తున్నాయి.

■ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ఆర్‌వోబీలు మంజూరు కాగా, వీటికి సంబంధించిన నిధులు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో డిపాజిట్ చేసింది. కానీ ఆ ప్రభుత్వం నిధులను మళ్లించింది. దీంతో నిర్మాణ పనులు ఆలస్యం, కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రెండేళ్లుగా ఎంపీ అర్వింద్ ఆర్‌వోబీల పనుల వేగవంతంలో, బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ, రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతేగాకుండా పలుమార్లు అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి లేఖలు రాశారు.

■ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటీవల జిల్లాకు విచ్చేసిన ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఈ విషయమై ఎంపీ చర్చించారు. త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీనిచ్చారు. ఈ క్రమంలోనే గత నెల 22న ఎంపీ అర్వింద్ సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. అదే సమయంలో ఆర్‌వోబీల పెండింగ్ బిల్లులు కూడా ఆయన దృష్టికి తీసుకురాగా, పదిరోజుల వ్యవధిలోనే మూడు ఆర్‌వోబీలకు సంబంధించి రూ.13 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేశారు. దీంతో ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగంగా పూర్తిచేయాలి

• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మోపాల్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మోపాల్, కులాస్‌పూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను ఆరా తీశారు. ప్రజాపాలనలో దరఖాస్తులో నమోదు కాని వారి పేర్లు నమోదు చేసేలా ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులందరి పేర్లు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండలంలో 9,259 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 6,703 (74 శాతం) పూర్తయ్యిందని ఎంపీడీవో చెప్పారు. జనవరి 3లోపు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు.. వాటి స్థానంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తే, అలాంటి వారి వివరాలను కూడా యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములు, ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హన్మాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.




మోపాల్‌లో సర్వే వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

వరద కాలువ ద్వారా నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను అధికారులు మంగళవారం ఉదయం ప్రారంభించారు. కాలువ ద్వారా ముందుగా 500 క్యూసెక్కుల నీటిని వదిలి క్రమంగా 2 వేల క్యూసెక్కులకు పెంచారు. వరద కాలువ నీటి ఆధారంగా మధ్య మానేరు వరకు సాగవుతున్న ఆయకట్టుకు నీరు అందించుట కోసం నీటి విడుదల చేపట్టినట్లు ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి తెలిపారు.

ఐదు టీఎంసీల నీటి వినియోగం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు కోసం ప్రధాన కాలువల ద్వారా నీటి విడుదలను డిసెంబర్ 25న ప్రారంభించారు. వారం రోజుల వ్యవధిలో ప్రాజెక్ట్ నుంచి ఐదు టీఎంసీల నీరు వినియోగం జరిగింది. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 463 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకాలకు 312 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్ 1089.70 (75.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,402.95 అడుగుల(14.917 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. వారబందీ ప్రకారం 15 రోజుల పాటు నీటిని విడుదల చేసి 10 రోజుల పాటు బంద్ చేయాల్సి ఉండగా వరి నాట్లు జోరందుకోవడంతో నీటి విడుదలను పొడిగించారు.

డాబా పైనుంచి పడి మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగర పరిధిలోని బోర్గాం (పి)లో ఓ మహిళ ప్రమాదవశాత్తు రెండో అంతస్తు డాబా పైనుంచి పడి మృతిచెందినట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్ పేటకు చెందిన కాలూరి నిహారిక (32)కు బోర్గాం నివాసి అయిన విజయ్ కుమార్‌తో 2007లో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిహారికకు గత కొన్నేళ్లుగా ఆరోగ్యం, మానసిక స్థితి బాగాలేదు. మంగళవారం మధ్యాహ్నం తన సొంత ఇంటి రెండవ అంతస్తు డాబాపై నిహారిక బట్టలు ఆర వేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడింది. ఈఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అన్న మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్‌కు చెందిన గోపి ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా పోలీసులు అతడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అతడికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు.

మరొకరికి రెండురోజులు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని మునిపల్లి సాయిలు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం అతడిని నిజామాబాద్ ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ ముందు హాజరుపర్చగా, రెండ్రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ పైన ఉన్న అంతస్తులో పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.45 వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.









